TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 92 | పేజీలు : 04| వెల: రూ.3/-

తెలంగాణ

శుక్రవారం | అక్టోబర్ 30, 2026




2లో..

# అన్ని రంగాలకూ హాలిడే ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే హాలిడే ఇవ్వాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కరువు, కరెంట్ కోతలతో రైతులు, పరిశ్రమలు విలవిల
- డీపీఆర్ లేకుండా మూసీ సుందరీకరణ పేరుతో లక్షన్నర కోట్ల దోపిడీకి స్కెచ్– గ్లోబల్ సమ్మిట్ కాదు..
- ఇదొక 'గోబెల్స్ సమ్మిట్' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తీవ్ర విమర్శలు




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :**

ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు రాష్ట్రంలోని అన్ని రంగాలకు 'హాలిడే' ప్రకటించిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కరెంట్ కోతలు, తాగు-సాగునీటి ఎద్దడితో రాష్ట్రం అల్లాడిపోతుంటే.. ప్రభుత్వం మాత్రం ప్రచార ఆర్భాటాలతో కాలం వెళ్లదీస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ, సామాజిక పరిస్థితులపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## మిస్టర్ చీఫ్ మినిస్టర్..

### జవహర్ నగర్ డంప్ యార్డ్ డీపీఆర్ తయారు చేయండి



4లో..

- ఎంపీ ఈటల రాజేందర్
- కేంద్రం నుంచి నిధులు తెచ్చే బాధ్యత నాది
- రాంకీ సంస్థ చెత్త నిర్వహణలో పూర్తిగా విఫలమైంది
- రేపు జవహర్ నగర్ బహిరంగ సభకు తరలిరావాలని పిలుపు




3లో..

## రాహుల్ సభకు కాంగ్రెస్ శ్రేణులు

సంగారెడ్డి నుంచి ఢిల్లీ పయనం

బస్సులను జెండా ఊపి ప్రారంభించిన జగ్గారెడ్డి

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, అక్టోబర్ 30, 2026

# సాయిబాబా మందిరంలో వైభవంగా గణపతి హోమం

### భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి వేడుకలు

### ఉచిత నేత్ర వైద్య శిబిరం, మహా అన్నదానం నిర్వహణ



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక సాయిబాబా మందిరంలో గణపతి హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా నిర్వహించారు. విఘ్నాలను తొలగించి సకల శుభాలను ప్రసాదించే విఘ్నేశ్వరుని అనుగ్రహం కోసం చేపట్టిన ఈ కార్యక్రమంతో మందిర ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో పులకించింది. మందిర అర్చకులు కిషోర్ శర్మ ఆధ్వర్యంలో హోమ క్రతువును వైభవంగా జరిపారు. భక్తుల శ్రేయస్సు, ఆయురారోగ్యాలు, సర్వవిఘ్నాల నివారణను ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మందిర చైర్మన్ మతుకుమల్ల హరగోపాల్, ధర్మకర్తలు వెయ్యిగండ్ల రమేష్, నిమ్మల శ్రీనివాస్ మరియు మందిర సిబ్బంది సాయి కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక సేవలతో పాటు సామాజిక బాధ్యతగా మందిర ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురు భక్తులు, స్థానికులు ఈ శిబిరంలో పాల్గొని ఉచితంగా నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మధ్యాహ్న హారతి తర్వాత భక్తులకు మహా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. భగవంతుని సేవతో పాటు ఉచిత వైద్యం, అన్నదానం ద్వారా 'మానవ సేవే మాధవ సేవ' అనే సందేశాన్ని అందించడం అభినందనీయమని భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## అన్ని రంగాలకూ హాలిడే ఇచ్చిన

# కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే హాలిడే ఇవ్వాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కరువు, కరెంట్ కోతలతో రైతులు, పరిశ్రమలు విలవిల
- డీపీఆర్ లేకుండా మూసీ సుందరీకరణ పేరుతో లక్షన్నర కోట్ల దోపిడీకి స్కెచ్– గ్లోబల్ సమ్మిట్ కాదు..
- ఇదొక 'గోబెల్స్ సమ్మిట్' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు రాష్ట్రంలోని అన్ని రంగాలకు 'హాలిడే' ప్రకటించిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కరెంట్ కోతలు, తాగు-సాగునీటి ఎద్దడితో రాష్ట్రం అల్లాడిపోతుంటే.. ప్రభుత్వం మాత్రం ప్రచార ఆర్భాటాలతో కాలం వెళ్లదీస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ, సామాజిక పరిస్థితులపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

### రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్లు తీసుకోవడం సిగ్గుచేటు:

ఎన్నికల వేళ రైతు డిక్లరేషన్లు ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు రైతుల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్లు' తీసుకునే దుస్థితిని తెచ్చిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. సాగునీరు, విద్యుత్ అందక పంటలు ఎండిపోతుంటే.. రైతులు జనరేటర్లు, ట్యాంకర్ల సాయంతో పంటలను కాపాడుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు తమ పంటలను తామే తగలబెట్టుకునే భయానక వాతావరణం నెలకొందని విమర్శించారు.

### డీపీఆర్ లేకుండా మూసీ సుందరీకరణ జపం:

రాష్ట్రంలో కరువు తాండవిస్తుంటే రేవంత్ రెడ్డి సర్కార్ కమీషన్ల కక్కుర్తి కోసం మూసీ సుందరీకరణ జపం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఎలాంటి డీపీఆర్ లేకుండా, ప్రాథమిక నివేదికలు లేకపోయినా లక్షన్నర కోట్ల రూపాయలతో మూసీ బ్యూటిఫికేషన్ పేరుతో దోపిడీకి తెరలేపారని దుయ్యబట్టారు. తాగునీటికీ కష్టాలు ఎదురవుతున్న ఈ తరుణంలో మూసీ ప్రాజెక్ట్‌ను తక్షణమే ఆపి, ఆ నిధులతో రైతులను, ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### 'కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదు':

రాష్ట్రంలో పరిశ్రమలకు పవర్ హాలిడేస్ ప్రకటించడం వల్ల పారిశ్రామిక రంగం కుదేలవుతోందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదు..




కరెంట్ ఉంటే కాంగ్రెస్ ఉండదు" అనే నానుడి నేడు అక్షరాలా నిజమవుతోందని వ్యాఖ్యానించారు. విద్యుత్ కోతలతో ఇండస్ట్రీలు మూతపడే పరిస్థితి వచ్చినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని మండిపడ్డారు.

### ఇది గ్లోబల్ సమ్మిట్ కాదు.. గోబెల్స్ సమ్మిట్:

రాష్ట్రం కరువుతో, కరెంట్ కోతలతో తల్లడిల్లుతుంటే ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ పేరుతో 'గోబెల్స్ సమ్మిట్' నిర్వహిస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ప్రచారాల కోసం వందల కోట్లు దుబారా చేస్తున్నారని, రాష్ట్రానికి ఏ ఒక్క కొత్త పెట్టుబడిని, ఉద్యోగాన్ని తీసుకురాలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఐటీ రంగంలో ఉద్యోగాలు గణనీయంగా తగ్గాయని, ఇప్పటివరకు తెచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాలపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఢిల్లీ పెద్దలకు, ముఖ్యంగా రాహుల్ గాంధీకి ఏటీఎంగా మారిందని ఆయన తీవ్రంగా ఆరోపించారు.

# 5వ డివిజన్‌లో కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

- ఏకశిలా కాలేజ్, లయోలా స్కూళ్లలో ఫారాల సేకరణ
- పాల్గొన్న ఇన్‌చార్జ్ కుసుమ లక్ష్మీనారాయణ, డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు 5వ డివిజన్‌లో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్ ఆధ్వర్యంలో, డివిజన్ ఇన్‌చార్జ్ కుసుమ లక్ష్మీనారాయణ నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఏకశిలా కాలేజ్, లయోలా పాఠశాలలను సందర్శించి అర్హులైన పట్టభద్రుల నుంచి ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను స్వీకరించారు. అర్హత కలిగిన ప్రతీ పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. డివిజన్ వైస్ ప్రెసిడెంట్ పండగ సాగర్, నాయకులు దాసరి సమ్మన్న, పూతాటి ప్రభాకర్, సోషల్ మీడియా ప్రతినిధి విశాల్, మహేందర్ పాల్గొన్నారు.

# నిరుపేదలకు అన్నవితరణ



**జనగామ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జనగామ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన పేద రోగులకు, వారి బంధువులకు 15వ వార్డు కౌన్సిలర్ మారబోయిన పాండు యాదవ్ అన్న సమర్పణ కార్యక్రమం నిర్వహించి తమ ఉదారతను, మానవత్వాన్ని చాటుకున్నారు. అమ్మ ఫౌండేషన్ ప్రేరణతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ మాట్లాడారు. ఫౌండేషన్ ఆశయాలకు అనుగుణంగా సమాజ సేవలో ముందుంటున్న కౌన్సిలర్ పాండు యాదవ్‌కు అమ్మ ఫౌండేషన్ టీమ్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కరోనా క్లిష్ట సమయంలోనూ వార్డు ప్రజలకు నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేయడంతో పాటు నిరంతరం అన్నదాన వితరణ చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ సేవా కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కొయ్యడ రవి, సభ్యులు ఎండి అఫ్రోజ్, బొల్లం కనకరాజు, పిట్టల కృష్ణ, సిద్ధిరాల చందు, కొయ్యడ విశ్వ పాల్గొన్నారు.





# మహిళా సంఘం భవన ప్రారంభోత్సవం

**వర్ధన్నపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ఆదేశానుసారం.. మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో నూతన మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా మరో నూతన మహిళా సంఘం భవన నిర్మాణానికి శుభారంభం చేస్తూ భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్, గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి సంయుక్తంగా భవనాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మహిళల అభ్యున్నతికి, సంఘాల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొడుగు ఏకాంత సారయ్య, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ గొడుగు భిక్షపతి, పీఏసీఎస్ డైరెక్టర్ మోటపోతుల సుదర్శనం, ఏటీఎం రాజీవ్, సీసీ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి నిమ్మల రాజు పాల్గొన్నారు. అలాగే గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు భాషబోయిన రామకృష్ణ, మంజంపల్లి నాగరాజు, గాడిపెల్లి రాజబాబు, బత్తిని జలంధర్, రాపోలు అనిత రవీందర్, ప్రశాంత్, రాధిక సుధాకర్, దొంతమల్ల పవన్ కళ్యాణ్; వివోవీలు శైలజ, సంధ్య, ప్రవంతి; వివో అధ్యక్షురాళ్లు అమ్మాజీ, ప్రవళిక, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు గ్రామ పుర ప్రముఖులు ఈరగాని సాంబయ్య, రామస్వామి, కృష్ణమోహన్, జనగాం లక్ష్మణ్, రామ్మూర్తి మరియు గ్రామపంచాయతీ సిబ్బంది, కారోబార్ గుండ యాకయ్య తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, అక్టోబర్ 30, 2026

# గర్భిణీలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.పుట్ల శ్రీనివాస్
- పికెట్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీ
- స్వయంగా పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ శ్రీనివాస్



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నగరంలోని బస్తీ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం ఆయన కంటోన్మెంట్ క్లస్టర్ పరిధిలోని పికెట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డా.శ్రీధర్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. స్వయంగా పిల్లల వైద్య నిపుణులైన డాక్టర్ పుట్ల శ్రీనివాస్.. సందర్శన సమయంలో ఆసుపత్రికి వచ్చిన చిన్నారులను స్వయంగా పరీక్షించి, వైద్యం అందించడం విశేషం. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో హాజరు రిజిస్టర్లు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, లాబొరేటరీ సేవలు, రికార్డులు, పరిశుభ్రతా పరిస్థితులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పిల్లల వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని, క్యాచ్‌అప్ క్యాంపెయిన్ వ్యాక్సిలేషన్ కార్యక్రమం ద్వారా అసలు టీకాలు తీసుకోని పిల్లలకు, మధ్యలో ఆపిన వారికి అన్ని డోసులు అందేలా చూడాలని ఆదేశించారు. వ్యాక్సిన్ల శీతలీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అర్హులైన బాలికలందరికీ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను త్వరితగతిన ఇప్పించి, లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ సర్వే, స్క్రీనింగ్ మరియు ఫాలో-అప్ ప్రక్రియలను ప్రతిరోజూ నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు



అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. వైద్యులు, సిబ్బంది విధిగా సమయపాలన పాటించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి. సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆరోగ్య పథకాలను ప్రతి అర్హుడికి చేర్చాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పికెట్ యూపీహెచ్‌సి వైద్యాధికారి డా. విశాల్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రోటోకాల్ ఉల్లంఘనపై సర్పంచ్ ఆవేదన

- కాళేశ్వరం ఆలయ ఈఓ వ్యవహారశైలిపై ఆగ్రహం
- స్థానికంగా ఉండకుండా గదికే పరిమితమవుతున్నారంటూ ఆరోపణలు
- మంత్రికి, నాయకులకు చెడ్డపేరు తెచ్చేలా ఈఓ ప్రవర్తన
- సర్పంచ్ మోహన్ రెడ్డి



**మహాదేవపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం, ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానం ఈఓ మహేష్ వ్యవహారశైలిపై స్థానిక సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలనకు వచ్చిన సందర్భంలో, గ్రామానికి ప్రథమ పౌరుడైన తనకు ఎలాంటి ప్రోటోకాల్ ఇవ్వకుండా ఈఓ నిర్లక్ష్యం వహించారని సర్పంచ్ మోహన్ రెడ్డి వాపోయారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇచ్చి, తనను అవమానించడం ఇది మూడోసారి అని ఆవేదన వ్యక్తం చేశారు.

- **స్థానికంగా ఉండరు.. పర్యవేక్షణ లేదు:**

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు రూ.195 కోట్లతో ఆలయాన్ని, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తుంటే, ఆలయ ఈఓ మాత్రం స్థానికంగా ఉండకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. మంత్రి స్వయంగా ప్రతి అధికారి స్థానికంగా ఉండి పనులను పర్యవేక్షించాలని ఆదేశించినా, ఈఓ మాత్రం జిల్లా కేంద్రం నుంచే రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. వచ్చినా కేవలం ఏసీ గదికే పరిమితమవుతున్నారు తప్ప, ఒక్క రోజు కూడా పునర్నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించలేదని మండిపడ్డారు. గతంలో రూ.100 గదుల నిర్మాణంలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే అవి భక్తులకు ఉపయోగపడకుండా పోయాయని, ఇప్పుడు కోట్ల రూపాయల ఆలయ పనుల్లోనూ అదే తీరు పునరావృతమవుతోందన్నారు. అంతేకాకుండా, అష్ట తీర్థాలకు సంబంధించిన భూసేకరణ జరుగుతున్నప్పుడు గ్రామస్తులకు గానీ, సర్పంచ్‌కు గానీ ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈఓ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ మంత్రికి, స్థానిక నాయకులకు చెడ్డపేరు తెస్తున్నారని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఉప సర్పంచ్ చెమ్మల సుధీర్ కుమార్, వార్డు మెంబర్లు రేవెల్లి రాకేష్, పానెం సంతోష్, బొల్లం రాజశేఖర్, సయ్యద్ ఇమ్రాన్, వెన్నపురెడ్డి విజయలక్ష్మి, రహీమా బేగం, పెద్ది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 'బండి సంజయ్ పాదయాత్ర'ను విజయవంతం చేయాలి

- బీజేపీ ఆధ్వర్యంలో 'చలో కరీంనగర్' సన్నాహక సమావేశం
- నూతనంగా ఎన్నికైన నాయకులకు సన్మానం

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నవంబర్ 5 గురువారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాపాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ పిలుపునిచ్చారు. స్థానిక పద్మశాలి సంఘ భవనంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో 'చలో కరీంనగర్' సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ.. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్న విద్రోహ శక్తుల ఆగడాలను తిప్పికొట్టడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వానికి మద్దతుగా నవంబర్ 5న కరీంనగర్‌లో జరిగే పాదయాత్రకు యువత, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఇదే వేదికపై బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన చిట్యాల రాజు, పట్టణ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన నేరెళ్ల సాయికుమార్, పట్టణ ఎండోమెంట్ కమిటీ కన్వీనర్‌గా ఎన్నికైన రేణుకుంట అశోక్, కో-కన్వీనర్‌గా ఎన్నికైన బిల్లా కృష్ణార్లను శాలువాలతో ఘనంగా



సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సన్మాహక సమావేశంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కోల కృష్ణస్వామి, కౌన్సిలర్ కొండ్లీపు ముత్యం, నాయకులు రేగుల మల్లికార్జున్, రేగుల శ్రీకాంత్, వాసం మల్లేశం యాదవ్, రేగుల రాజకుమార్, వివేక్ రెడ్డి, ఎడ్ల కమలాకర్, కటకం శ్రీనివాస్, చిక్కుడు మల్లేశం, చేపూరి రాకేష్ పాల్గొన్నారు.

# రాహుల్ సభకు కాంగ్రెస్ శ్రేణులు

- సంగారెడ్డి నుంచి ఢిల్లీ పయనం
- బస్సులను జెండా ఊపి ప్రారంభించిన జగ్గారెడ్డి



**సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించనున్న రాహుల్ గాంధీ భారీ బహిరంగ సభకు హాజరయ్యేందుకు సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా బయలుదేరారు. సంగారెడ్డి ఐబీ వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ యాత్రలో సదాశివపేట మండలం నుంచి సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, నాయకులు సిద్దన్న, శ్రీనివాస్ యాదవ్‌ల నాయకత్వంలో 46 మంది, కొండాపూర్ మండలం నుంచి ఆత్మ చైర్మన్ ప్రభు, నాయకులు నర్సింహారెడ్డి, మల్లారెడ్డిల ఆధ్వర్యంలో 26 మంది ఢిల్లీ బాట పట్టారు. నిర్మల జగ్గారెడ్డి, భరత్ సాయిరెడ్డిలతో సహా సంగారెడ్డి నియోజకవర్గం నుంచి మొత్తం 150 మంది నాయకులు, కార్యకర్తలు ఈ సభలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర ఉత్సాహం వ్యక్తమైంది. బస్సుల ప్రారంభ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, బబ్బు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఓటరు నమోదు వేగవంతం చేయాలి

- మన్నె గోవర్ధన్ రెడ్డి



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో, ఖైరతాబాద్ డివిజన్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో ఉచిత ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులకు, స్థానిక పట్టభద్రులకు ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ మాట్లాడుతూ.. అర్హులైన పట్టభద్రులందరూ తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకునేలా అధ్యాపకులు, ముఖ్య నేతలు చొరవ తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రుల పాత్ర కీలకమని, నమోదు ప్రక్రియను వేగవంతం చేసి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ గజ్జల ఆనంద్, నాయకులు శామ్ గౌడ్, అభినవ్, నవీన్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

# నేల ఆరోగ్యమే రైతు భవిష్యత్తు



**రేగొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే రైతులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని కనపర్తి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఖేత్ బచావో అభియాన్'లో భాగంగా రేగొండ మండలంలోని రేపాక గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "సేవ్ ద సాయిల్, సేవ్ ఫార్మింగ్, సేవ్ ఫార్మర్స్" అనే నినాదంతో భూసార పరిరక్షణ ఆవశ్యకతను వివరించిన ఆయన, భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే సమతుల్య ఎరువులను వాడాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, పచ్చిరొట్ట పైర్లు మరియు జీవ ఎరువుల వినియోగంతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. అలాగే భూగర్భ జలాల పరిరక్షణకు చిరుధాన్యాల వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్‌లో లభించే నకిలీ విత్తనాలు, ఎరువుల పట్ల రైతులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం-కిసాన్, పంటల బీమా, కిసాన్ క్రెడిట్ కార్డ్ వంటి సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, అక్టోబర్ 30, 2026

# పాలకుర్తి నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదుపై సమీక్ష

- ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- ప్రశ్నించే హక్కు కోసం ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి



**రాయపర్తి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి మండల కేంద్రంలో మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ / ఖమ్మం–వరంగల్–నల్గొండ పట్టభద్రుల (ఎమ్మెల్సీ) ఓటరు నమోదు కార్యక్రమంపై ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు, నాయకులు రాకేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. పట్టభద్రులు తమ ప్రాథమిక హక్కులను, ప్రశ్నించే గొంతును కాపాడుకోవాలంటే తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు బీఆర్ఎస్ (గులాబీ) శ్రేణులు, కార్యకర్తలు వారధిలా పనిచేసి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ లేదా తత్సమాన విద్యను పూర్తి చేసిన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు. నవంబర్ 6వ తేదీ వరకు మాత్రమే ఓటరు నమోదుకు ఆఖరి గడువు ఉన్నందున, మిగిలిన సమయాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరిచే దరఖాస్తు చేయించాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో రాయపర్తి మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మిస్టర్ చీఫ్ మినిస్టర్..

## జవహర్ నగర్ డంప్ యార్డ్ డీపీఆర్ తయారు చేయండి

- ఎంపీ ఈటల రాజేందర్
- కేంద్రం నుంచి నిధులు తెచ్చే బాధ్యత నాది
- రాంకీ సంస్థ చెత్త నిర్వహణలో పూర్తిగా విఫలమైంది
- రేపు జవహర్ నగర్ బహిరంగ సభకు తరలిరావాలని పిలుపు



**కీసర, వాయిస్ ఆఫ్ వందేభారత్ :** జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన 'జవహర్ నగర్ జన సంకల్ప యాత్ర' మూడో రోజు కీసర నుంచి ఘనంగా ప్రారంభమైంది. పాదయాత్రకు స్థానిక ప్రజలు, డంపింగ్ యార్డ్ బాధితులు పెద్ద ఎత్తున హాజరై ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా పాల్గొననున్నారు. పాదయాత్ర ప్రారంభానికి ముందు కీసరలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఈటల రాజేందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

### ప్రజా ఆరోగ్యాన్ని విస్మరిస్తున్నారు:

ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఈటల మండిపడ్డారు. "నేను ఆరుగురు ముఖ్యమంత్రులతో పోరాడిన వ్యక్తిని. ఇతరులపై నిందలు వేయడానికి నేను రావడం లేదు. జవహర్ నగర్ డంప్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం ఉందనే నమ్మకంతోనే ఈ పాదయాత్ర చేపట్టాను" అని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ లీచేట్ వల్ల పరిసర చెరువులు, బోర్ల నీళ్లు పచ్చగా మారి తీవ్రంగా కలుషితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాంకీ సంస్థ చెత్త నిర్వహణను వ్యాపార కోణంలో చూస్తోందే తప్ప ప్రజా ఆరోగ్య కోణంలో పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతతో ఒక్క గ్రాము చెత్త కూడా వృథా కాకుండా రీసైక్లింగ్ చేసి సంపద సృష్టించవచ్చని సూచించారు.

### డీపీఆర్ సిద్ధం చేయండి – నిధులు తెస్తాం:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఎంపీ ఈటల సంచలన వ్యాఖ్యలు చేశారు. "కూట్లో రాయి తీయలేని వాడు ఏట్లో రాయి తీస్తా అన్నట్లుంది ప్రభుత్వం వైఖరి. రూ.2,000 కోట్లతో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించలేని మీరు, లక్ష కోట్లు ఖర్చు పెట్టి మూసీ ప్రక్షాళన చేస్తామంటే ఎలా నమ్మాలి? రేవంత్ రెడ్డి గారూ.. లక్షలాది మంది నిరుపేదల జీవితాలతో చెలగాటమాడకండి. కేంద్ర ఎంపీగా నేను డిమాండ్ చేస్తున్నాను.. తక్షణమే ఈ డంప్ యార్డ్ తరలింపుపై డీపీఆర్ తయారు చేయండి, కేంద్రం నుంచి నిధులు ఇప్పించే బాధ్యత నాది" అని హామీ ఇచ్చారు. ప్రశ్నించే గొంతు అని ఓట్లేసి గెలిపించిన ప్రజలను నిచ్చెనమెట్లుగా వాడుకుని వదిలేయవద్దని, పేద బిడ్డలను కుక్కలు పీక్కుతింటున్నా పట్టించుకోకపోవడం దారుణమని ధ్వజమెత్తారు.

### రేపు భారీ బహిరంగ సభ:

బాధితుల తరపున మొదలైన ఈ పోరుబాట డంపింగ్ యార్డ్ తరలించే వరకు ఆగదని ఈటల స్పష్టం చేశారు. శుక్రవారం జవహర్ నగర్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు బాధితులు, నిరుపేదలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మార్కెట్ కమిటీ అభివృద్ధికి రూ.3.94 కోట్లు మంజూరు

- ఏఎంసీ చైర్మన్ రొండి రాజు– ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో నిధుల విడుదల
- మర్రిపల్లి వద్ద 12 ఎకరాల్లో మోడల్ మార్కెట్ యార్డ్ నిర్మాణం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3.94 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గురువారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాలకవర్గంతో కలిసి ఆయన మాట్లాడారు. స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, కృషితోనే ఈ నిధులు విడుదలయ్యాయని స్పష్టం చేశారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో నూతన మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే సూచనతో జిల్లా కలెక్టర్ స్పందించి 12 ఎకరాల భూమిని కేటాయించారని తెలిపారు. సదరు స్థలంలో ఏఎంసీ భవనం, కార్యదర్శి భవనం మరియు యార్డ్ నిర్మాణానికి రూ.7 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు అందించగా, ప్రభుత్వం మొదటి విడతగా రూ.3.94 కోట్లను మంజూరు చేసిందన్నారు.

### చేపట్టబోయే అభివృద్ధి పనులు:

మంజూరైన నిధులతో మొత్తం 11 రకాల అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు లభించాయని చైర్మన్ వివరాలు వెల్లడించారు. జంగిల్ క్లియరెన్స్, గ్రౌండ్ లెవలింగ్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, ఆర్ఓ తాగునీటి ప్లాంట్, పురుషులు–మహిళలకు శౌచాలయాలు, అప్రోచ్ రోడ్డు, విద్యుదీకరణ, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు. కవర్డ్ షెడ్‌ను 20 నూతన వ్యాపార గదులుగా పునర్నిర్మించడం.

### రూ.1,000 కోట్లతో నియోజకవర్గ ప్రగతి:

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో వేములవాడ నియోజకవర్గంలో దాదాపు రూ.1,000 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని రొండి రాజు కొనియాడారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధికి రూ.250 కోట్లు, 80 ఫీట్ల విస్తరణ రోడ్డు నిర్మాణానికి రూ.46 కోట్లు వెచ్చించి పనులు వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు.

రైతాంగ సంక్షేమానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి, కృషి చేసిన ఎమ్మెల్యేకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి సరోజ, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, డైరెక్టర్లు దైత కుమార్, ఖమ్మం గణేష్, గుర్రం విద్యాసాగర్, మ్యాక స్రవంతి హరినందన్ రెడ్డి, కత్తి కనకయ్య, వస్తాద్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పేదలు, రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- విద్యుత్ స్తంభాల నిర్మాణానికి శంకుస్థాపన
- సబ్సిడీపై ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు, పోళ్ల ఏర్పాటు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి గ్రామంలో రూ. 10 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న 41 నూతన విద్యుత్ స్తంభాల నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు వేయించాలంటే ఒక్కో పోలుకు రూ. 6,000 నుంచి రూ. 7,000 వరకు చెల్లించాల్సి వచ్చేదని, 10 పోళ్లు వేయించాలంటే రూ. 70,000 నుంచి రూ. 80,000 వరకు రైతులపై తీవ్ర భారం పడేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల నాయకత్వంలో పేదలు, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు కేవలం రూ. 700 చెల్లిస్తే చాలు.. కిలోమీటరు పరిధి వరకు ఉచితంగా 10 విద్యుత్ స్తంభాల వరకు ఏర్పాటు చేసి కనెక్షన్ అందిస్తున్నాం. వ్యవసాయ కనెక్షన్ల కోసం 5 హెచ్‌పీ మోటారుకు రూ. 9,000, 7.5 హెచ్‌పీ మోటారుకు రూ. 13,000 చెల్లిస్తే కిలోమీటరు దూరమున్నా సరే ఉచితంగా 12 స్తంభాల వరకు వేసి విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నాం. గ్రామాల్లో ప్రజలు, రైతుల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి సౌకర్యాలను విస్తరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.